
సాక్షి సూర్యాపేట

బుధవారం ၊ 5 ၊ ఫిబ్రవరి ၊ 2025



త్రిపిటక ఉత్సవం
నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ఈ నెల 7వ తేదీన త్రిపిటక పఠనోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. - 8లో



చెర్వుగట్టు జాతర ప్రారంభం
నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో రామలింగేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో



అధ్యయనోత్సవాలు
యాదగిరిగుట్ట శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

10న అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రామగిరి(నల్లగొండ) : పౌర్ణమి సందర్భంగా ఫిబ్రవరి 10వ తేదీన సాయంత్రం 7 గంటలకు జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్‌ఎం జానిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రతీ పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. బస్సులో ప్రయాణించే వారికి ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడు వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ : 9298008888, లేదా సమీప బస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



నాగారంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం

నాగారం : విద్యార్థుల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై మంగళవారం నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1నుంచి 19 ఏళ్ల వరకు వయస్సు ఉన్న పిల్లల్లో ఎక్కువగా పరాన్న జీవి ద్వారా నులి పురుగులు సంక్రమిస్తాయన్నారు. వీటి నివారణకు 1నుంచి 2సంత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2నుంచి 19సంవత్సరాల పిల్లలకు ఆల్బెండ జోల్ 400 ఎంజీ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మారయ్య, ఎంఈఓ వాసం ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్, స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరయ్య, సీహెచ్‌ఓ మాలోతు బిచ్చునాయక్, జీహెచ్‌ఎం జ్ఞానేశ్వరచారి, పీహెచ్‌ఎన్ అరుణకుమారి, సూపర్ వైజర్ రామచంద్ర, అంగన్‌వాడీ సూపర్ వైజర్ ప్రమీల పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



రేపాల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

మునగాల: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం మునగాల మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు తింటే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు.ఈ సదస్సులో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి భాస్కర్‌రాజు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ సాంబశివరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి లింగారెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

నల్లగొండ : వరంగల్‌–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంగళవారం ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. మొదటి రోజు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది.

హనుమంతుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు.

• రథసప్తమి వేడుకలు




రథసప్తమి వేడుకల సందర్భంగా మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం సూర్యక్షేత్రంలో స్వామి పాదాలను తాకిన సూర్యకిరణాలు, స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు - అర్వపల్లి

అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : అధికారులు పారదర్శకంగా పనిచేసి గుర్తింపు పొందాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానాల్లో కాన్పులు జరిగేలా గర్భిణులకు వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. డీవార్మింగ్ డేను పురస్కరించుకొని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రం అందించాలన్నారు. మందుల స్టాక్ వివరాలను డాక్టర్ మౌనికను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లో డబ్బులు ఎవరు దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీఎం మంజులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వ్యవసాయ అధికారి దివ్యకు సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు దాచారం నర్సరీని కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, ఎంపీడీఓ, ఎంపీఓ రాజేశ్వర్, ఏపీఓ ఈశ్వర్, ఏపీఎం మంజుల, వ్యవసాయ అధికారి దివ్య, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి రాహుల్, డీఈ గోపి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం 71వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా జట్టు

విలీన గ్రామం..

ఆత్మీయతకు దూరం

- మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల కూలీలకు వర్తించని ఆత్మీయ భరోసా పథకం
- ఇప్పటికే ఐదేళ్లుగా ఉపాధి పనులకు దూరం
- పనులు లేక వలస వెళ్తున్నామని ఆవేదన
- భూమిలేని కూలీలను ఆదుకోవాలని వినతి



మేజర్ గ్రామ పంచాయతీగా తిరుమలగిరి 2018 ఆగస్టు 2వ తేదీన మున్సిపాలిటీగా ఏర్పడింది. ఇందులో తిరుమలగిరి గ్రామంతో పాటు అనంతారం, నందాపురం, మాలిపురం గ్రామాలు విలీనమయ్యాయి. విలీనమైన గ్రామాల్లో ఐదు వేల మంది కూలీలు ఉన్నారు. విలీనమైనప్పటి నుంచి వీరంతా ఉపాధి పథకానికి దూరమయ్యారు. అలాగే ఇప్పుడు ఆత్మీయ భరోసా పథకం కూడా వీరికి వర్తించేలా లేదు. ఇదీ.. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల కూలీల పరిస్థితికి నిదర్శనం.

తిరుమలగిరి (తుంగతుర్తి): మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించడం లేదు. దీంతో విలీన గ్రామాల ప్రజలు ఉపాధి పనులు లేక అయోమయానికి గురవుతున్నారు. మున్సిపాలిటీలో తమ గ్రామం విలీనమైనందుకు హోదా పెరిగిందని సంతోషించాలో, ఉపాధి పనులు కల్పించనందుకు బాధపడాలో అర్థంకావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆత్మీయ భరోసా పథకం కింద గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన విషయం విదితమే. భూమి లేని ఉపాధి కూలీలను అర్హులుగా చేర్చగా విలీన గ్రామాల కూలీలపై స్పష్టత కరువైంది. ఇప్పటికే ఉపాధి పథకంపై నీలినీడలు కమ్ముకోగా ఆత్మీయ భరోసా పథకాన్నైనా వర్తింపజేయాలని విలీన గ్రామాల కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

విలీన గ్రామాల్లో పనులేవీ?

జిల్లాల పునర్విభజన, మున్సిపాలిటీల అప్‌గ్రెడేషన్‌తో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. జిల్లాలో ఐదు మున్సిపాలిటీల పరిధిలో 21 గ్రామాలు విలీనమయ్యాయి. సదరు గ్రామాలు పంచాయతీ పాలక వర్గం నుంచి మున్సిపాలిటీల్లో వార్డులుగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి పథకం దూరమైంది. విలీనమైన గ్రామాల పరిధిలో మొత్తం 15 వేల మందికి పైగా కూలీలు ఉండగా ఉపాధి పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

విలీన గ్రామాల కూలీలకు దక్కని భరోసా

ఇటీవల గ్రామాల వారీగా చేపట్టిన ప్రజా పాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆన్‌లైన్‌లో ఉపాధి కూలీల వివరాల ఆధారంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లిన వారినే ఎంపిక చేశారు. దీంతో తిరుమలగిరి మండలంలో 16 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్నవారికే ఆత్మీయ భరోసా పథకానికి కూలీలు ఎంపికయ్యారు. తొలి విడతగా ప్రభుత్వం రూ.6 వేలను కూలీల ఖాతాల్లో జమ చేశారు. అయితే తిరుమలగిరితోపాటు మిగతా నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఉపాధి హామీ పథకం లేకపోవడంతో అందులో విలీనమైన గ్రామాల కూలీలు ఆత్మీయ భరోసాకు ఎంపిక కాకుండా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు ఉపాధి పనులు కల్పించడంతోపాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేయాలని మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల కూలీలు వేడుకుంటున్నారు.

మున్సిపాలిటీల్లో విలీన గ్రామాలు..

సూర్యాపేట : దురాజ్‌పల్లి, పిల్లలమర్రి, రాయినిగూడెం, కుడకుడ, బీబిగూడెం, కుసుమవానిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, గాంధీనగర్, పాషానాయక్‌తండా, కోటినాయక్ తండా, ఖాసీంపేట, దాసాయిగూడెం.
కోదాడ : తమ్మర, కొమరబండ.
నేరేడుచర్ల : రామాపురం, నర్సయ్యగూడెం, రామగిరి.
తిరుమలగిరి : మాలిపురం, నందాపురం, అనంతారం.

ఐదేళ్లుగా పనులు లేవు

తిరుమలగిరి మున్సిపాలిటీలో మా ఊరు కలిపినప్పటి నుంచి ఐదేళ్లుగా మాకు ఉపాధి పనులు కల్పించడం లేదు. గతంలో ఏడాదికి 100 రోజులు ఉపాధి పనికి పోయేదానిని. ఇప్పుడేమో పని లేదు. మున్సిపాలిటీలో మా ఊరును విలీనం చేయడం వల్ల ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను కోల్పోయాం. ప్రభుత్వం మాకు భరోసా కల్పించాలి. – నర్సమ్మ, మాలిపురం

గతంలో మాదిరిగా పనులు కల్పించాలి

మున్సిపాలిటీలో మా ఊరును కలుపుడేమో కాని మాకు ఉపాధి హామీ పథకం కింద పనులు లేకుండా పోయాయి. గతంలో మాదిరిగా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలి. భూమి లేని కూలీలకు ఇచ్చే రూ.12 వేల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని మున్సిపాలిటీలో విలీన గ్రామాల కూలీలకు కూడా వర్తింపజేయాలి. – మల్లయ్య, నందాపురం

పేట మార్కెట్‌కు ఐకేపీ బస్తాల్లో ధాన్యం

- మిల్లు నుంచి తెచ్చినట్లు అనుమానాలు..?
- రెండేళ్ల కిందటి ధాన్యమని చెబుతున్న రైతు
- నిలిచిన కొనుగోలు, విచారణ చేస్తున్న అధికారులు



సూర్యాపేట మార్కెట్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఏఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌యార్డుకు గోనెసంచుల్లో (నల్లబస్తాలు) విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకేసారి 240 బస్తాలు, అదీ ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసే బస్తాల్లో ఉండడం అనుమానాలకు బలం చేకూరుతోంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గరిడేపల్లి మండలం గడ్డిపల్లికి చెందిన బచ్చు సత్తమయ్య సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు దాదాపు 240 బస్తాల ధాన్యాన్ని ఓ లారీలో మంగళవారం విక్రయానికి తీసుకొచ్చారు. ఈ ధాన్యం ఐకేపీ కేంద్రాలకు సివిల్ సప్లయ్ అధికారులు అందించే బస్తాల్లో ఉండడంతో అనుమానించి కొందరు మార్కెట్ యార్డు, సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. ఈ వడ్లు ఎక్కడివన్న విషయం తేల్చాల్సింది సివిల్ సప్లయ్ అధికారులు అని, తమకు సంబంధం లేదని మార్కెట్ అధికారులు చెప్పారు. అనంతరం యార్డుకు ఏఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో వచ్చి అనుమానాస్పదంగా ఉన్న వడ్లను పరిశీలించి విచారణ చేపట్టారు. విచారణ సాగుతుండడంతో ఈ వడ్ల కొనుగోలు ప్రస్తుతం నిలిచిపోయింది.

మిల్లు నుంచి తెచ్చినట్లు అనుమానాలు..?

విచారణ సందర్భంగా రైతు సత్తమయ్య మాట్లాడుతూ.. తాను పదెకరాల్లో వరి సాగు చేశానని, 2023–24 వానాకాలం సంబంధించి వడ్లను ఇప్పుడు అమ్ముతున్నట్లు చెబుతున్నాడు. అయితే రైతు తెచ్చిన ధాన్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడ్డిపల్లిలో సీఎంఆర్ ఇవ్వకుండా పక్కదారి పట్టించిన మిల్లును గతంలో అధికారులు సీజ్ చేశారు. అదే మిల్లును ప్రస్తుతం మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతు సత్తమయ్య కొడుకు తిరిగి నడిపిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం రైతువేనని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు.



సూర్యాపేటలో జానారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

తప్పుల తడకగా సర్వే

సూర్యాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వే తప్పుల తడకగా ఉందని బీసీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బీసీలని అణగదొక్కటానికే వారిజనాభాను తక్కువ చేసి చెబుతున్నారని దానికి మాజీ మంత్రి జానారెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ సూర్యాపేటలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వేను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో కుంభం నాగరాజు, చాంద్‌పాషా, వల్లా సైదులు యాదవ్, మీర్ అక్బర్, ఆవుల అంజయ్య, సూపర్ సైదులు, చింతకాయల జానయ్య, బడుగుల నాగార్జున, ఆవుదొడ్డి శ్రీకాంత్, గుంటూరు విజయ్, గణేష్, ఉప్పునూతల కోటేష్, అన్వేష్, సేవ్య, సుమన్, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం , రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు , లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ప్రజ్ఞా పాఠవాలు పెంపొందించుకోవాలి

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు ప్రజ్ఞా పాఠవాలు పెంపొందించుకోవాలని జిల్లా సెక్టోరియల్ అధికారి కందిబండ శ్రవణ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజు, రాష్ట్ర సైన్స్ మాజీ కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం 2025ను పురస్కరించుకొని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్‌లో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం ఈశ్వర్(ఇమాంపేట మోడల్ స్కూల్), ద్వితీయ స్థానం రాకేష్ (మహాత్మా జ్యోతిరావు పూలే నేరేడు చర్ల), తృతీయ స్థానం రేఖశ్రీ (జెడ్పీహెచ్‌ఎస్‌కోదాడ) పొందారు. వీరిని రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేశారు. విజేతలకు దశరథ ఫౌండేషన్ మెమోరియల్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. జయ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు చింత రెడ్డి రామలింగారెడ్డి, కె. గురుమూర్తి, జాఫర్, చంద్రశేఖర్, వి. శ్రీనివాస్, ఎ.వెంకన్న, లింగమూర్తి, ఝాన్సీ, ఎం. జీ. చంద్రశేఖర్, నరేందర్ రెడ్డి, సత్యనారాయణ, అబెల్ శశి, రమేష్ బాబు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

గురుకులం.. గాడితప్పింది!

- నెమలిపురి ఎస్సీ గురుకులంలో పదోతరగతి ఫేర్‌వెల్‌లో కత్తులు, కటార్లతో విద్యార్థుల వీరంగం
- పాఠశాల ప్రహరీ పక్కనే బెల్ట్‌షాపు
- నిలువరించలేకపోయిన ఉపాధ్యాయులు
- విద్యార్థులకు మద్యం కోసం అప్పులు పెడుతున్న నిర్వాహకులు!



నెమలిపురిలోని ఎస్సీ గురుకుల పాఠశాల

కోదాడ: కోదాడకు సమీపంలోని నెమలిపురి ఎస్సీ గురుకుల పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు అదృశ్యమై అందరినీ ఆందోళనకు గురిచేసి మరుసటి రోజు పోలీసులకు చిక్కిన సంఘటనలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. పదోతరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించడంతో పాటు దీనికోసం ప్రతి విద్యార్థి నుంచి డబ్బులు వసూలు చేయడం, పార్టీలో విద్యార్థులు మద్యం సేవించి కత్తులు, కటార్లతో హల్‌చల్ చేసినా ఉపాధ్యాయులు నిలువరించలేకపోయినట్లు తెలిసింది. పాఠశాల ప్రహరీ పక్కనే బెల్ట్‌షాపు నడుస్తున్నా ఉపాధ్యాయులుగానీ , పోలీసులుగానీ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

తోటి విద్యార్థులతో గొడవకు దిగడంతో..

పదో తరగతి పరీక్షలు మార్చి 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో కోదాడ సమీపంలోని నెమలిపురి కాలనీలో ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అక్కడి ఉపాధ్యాయులు ఫేర్‌వెల్‌పార్టీ నిర్వహించారు. ఈ పార్టీ కోసం ప్రతి విద్యార్థి నుంచి రూ.400చొప్పున వసూలు చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల ప్రహరీ పక్కనే ఉన్న బెల్ట్‌షాపులో మద్యం సేవించిన విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీలో కత్తులు, కటార్లు పట్టుకొని వీరంగం సృష్టించడమే కాకుండా తోటి విద్యార్థులతో గొడవకు దిగడంతో పరిస్థితి అదుపు తప్పిందని కొందరు విద్యార్థులు అంటున్నారు.

గోడదూకి బయటికి వచ్చి..

మునగాల మండల కేంద్రంలో ఉండాల్సిన బాలుర గురుకుల పాఠశాలను అక్కడ సరైన వసతి లేకపోవడంతో కోదాడ మండల పరిధిలోని పులిచింతల పునరావాస గ్రామమైన నెమలిపురి వద్ద ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలకు ప్రహరీ తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యార్థులు తరచూ గోడ దూకి బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు పాఠశాల ప్రహరీ సమీపంలోనే బెల్ట్‌షాపు ఉంది. ఇక్కడి బెల్ట్‌షాపు నిర్వాహకులు మద్యం కోసం విద్యార్థులకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు అప్పులు కూడా పెడుతున్నారని, పుస్తకాలు, ఖర్చుల కోసం డబ్బులు పంపాలని దీని కోసమే వేధిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల నిర్వాహకులు దీనిపై కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పాఠశాల వ్యవహారంలో కఠినచర్యలు తీసుకొని సరిదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

కోదాడ మండల పరిధిలోని నెమలిపురి ఎస్సీ గురుకులం విద్యార్థులు పాఠశాల నుంచి పరారైన సంఘటనపై విచారణ జరిపిన అధికారులు ప్రిన్సిపాల్ ఝాన్సీరాణిని మంగళవారం సస్పెండ్ చేశారు. పాఠశాల నుంచి విద్యార్థులు అదృశ్యమైన విషయాన్ని కలెక్టర్‌తో పాటు గురుకులసొసైటీ అధికారులకు సరైన సమయంలో తెలియజేయకపోవడంతో గురుకులాల రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి ఆమెను సస్పెండ్ చేశారు. సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో జోనల్ ఆఫీసర్ విద్యారాణి షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

కలెక్టర్ విచారణ

విద్యార్థులు పారిపోయిన సంఘటనలో పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఇప్పటికే కలెక్టర్ విచారణ జరిపించారు. ఈ సంఘటనలో విద్యార్థులు మితిమీరి ప్రవర్తించడంతో పాటు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం వంటి విషయాలపై కలెక్టర్ చర్యలు తీసుకునే వీలుందని తెలుసుక్న ఉద్యోగులు ప్రజాప్రతినిధుల వద్దకు పైరవీల కోసం వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పాఠశాల ప్రిన్సిపాల్ గతంలో సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో పని చేసిన సమయంలో అక్కడ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. మూడు నెలల క్రితమే తిరిగి విధుల్లో చేరి ఇక్కడికి ప్రిన్సిపాల్‌గా వచ్చినట్లు తెలిసింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చౌటుప్పల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలం అందెపల్లి గ్రామానికి చెందిన ఇసరు ఉదయ్(25)తో పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అతడి మిత్రులు రాగాడి రాజేష్, మందడుగు ఉపేందర్ చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామ పరిధిలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. అదే కంపెనీకి చెందిన హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు ముగ్గురు కలిసి బైక్‌పై మంగళవారం యాదగిరిగుట్టకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి హాస్టల్‌కు వెళ్తుండగా లింగోజిగూడెం గ్రామం వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఉదయ్ మృతిచెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


నారాయణమ్మ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో నివాసముంటున్న ఎలక నారాయణమ్మ ఈ నెల 3వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా నారాయణమ్మ ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు పాపిరెడ్డి మంగళవారం సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట టౌన్ ఎస్ఐ తెలిపారు. నారాయణమ్మ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి దుర్మరణం

చౌటుప్పల్: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి జారిపడి కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పునూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి నాగభూషణం(43) జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి ఐదు నెలల క్రితం చౌటుప్పల్‌కు వలస వచ్చాడు. స్థానికంగా రాంనగర్ కాలనీలో నివాసం ఉంటూ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం నాగభూషణం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల హెచ్‌ఎండీఏ వెంచర్‌లో తాపీ పనికి వెళ్లాడు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న భవనం నాలుగో అంతస్తు పైనుంచి జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య అరుణ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువు వద్దకు చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. మృతుడి వయస్సు 35నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి గురించిన వివరాలు తెలిసిన వారు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు


గాయపడిన కూలీలు

హాలియా: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం హాలియా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం హజారిగూడెం నుంచి పది మంది మహిళా కూలీలు పెద్దవూర మండలంలోని పెద్దగూడెనికి మిర్చి ఏరేందుకు మంగళవారం ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో హాలియా పట్టణంలోని చర్చి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హజారిగూడెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు యానక లచ్చమ్మ, భూత వెంకటమ్మ, ఏర్పుల నాగమ్మ, చిన్న నాగమ్మకు చేతులు విరిగాయి. మరో ఇద్దరు మహిళలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను హాలియా పట్టణంలోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసం ఉంటున్న ముక్క నాగేశ్వరరావు శనివారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలో ఉన్న 5 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, రూ 80 వేల నగదును చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

బుద్ధవనంలో త్రిపిటక ఉత్సవం


నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం


విగ్రహాలకు రంగులద్దిన నిర్వాహకులు

- 7వ తేదీన 108మంది బౌద్ధ భిక్షువులతో నిర్వహించేందుకు ఏర్పాట్లు
- దక్షిణ భారతదేశంలో తొలిసారిగా సాగర్‌లోనే..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో బుద్ధవనంలో ఈ నెల 7వ తేదీన త్రిపిటక పఠనోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన మహాబోధి సొసైటీ, త్రిపిటక సంగాయన మండలి సంయుక్తంగా దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా నాగార్జునసాగర్‌లో త్రిపిటక పఠనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ సహకారం అందిస్తూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. 6వ తేదీ సాయంత్రం నాగార్జునసాగర్‌కు 108 మంది బౌద్ధ భిక్షువులు, మరో 100మందికి పైచిలుకు బౌద్ధులు రానున్నారు. వీరు రాత్రి బస చేసేందుకు ఇప్పటికే నాగార్జునసాగర్‌లోని విజయ విహార్‌తో పాటు ప్రాజెక్టు హౌజ్, ప్రైవేట్ లాడ్జీలు, సాగర్‌కు సమీపంలో దక్షిణ విజయపురి, మాచర్ల ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేశారు.

బుద్ధవనం ఆకర్షణీయంగా..

అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న త్రిపిటక పఠనోత్సవ కార్యక్రమంలో ప్రపంచ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, బౌద్ధులు పాల్గొననున్నారు. దీంతో బుద్ధవనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. బుద్ధవనంలోని శిల్పాలకు మెరుగులు దిద్దుతున్నారు. జాతకపార్కు, బుద్ధచరితవనం, ధ్యానవనం, మహాస్థూపం, స్థూపవనాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

సాగర్‌లో మూడురోజుల పాటు..

మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. 6వ తేదీ సాయంత్రం వస్తున్న బౌద్ధులు ఆ రాత్రి ఇక్కడే బస చేస్తారు. 7వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు త్రిపిటక పఠనోత్సవ కార్యక్రమం జరుగుతుంది. 8వ తేదీ ఉదయం నాగార్జున కొండకు బౌద్ధులంతా లాంచీల్లో వెళ్తారు. మ్యూజియంతో పాటు కృష్ణా నది తీరంలో బుద్ధుడికి సంబంధించిన చైత్యాలు, ఆరామాలు తదితరాలను సందర్శిస్తారు. బోధి వృక్షం కింద ప్రార్థనల అనంతరం తిరిగి లాంచీల్లో ఉత్తర విజయపురిలోని విజయ విహార్‌కు చేరుకుంటారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ మహాబోధి సొసైటీ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు.

దక్షిణ భారతదేశంలో మూడు చోట్ల

దక్షిణ భారతదేశంలో మూడు రాష్ట్రాల్లో త్రిపిటక పఠనం నోత్సవం నిర్వహించనున్నారు. లైఫ్ ఆఫ్ బుద్ధధర్మ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో మొదటగా తెలంగాణలో, అనంతరం కర్నాటక రాష్ట్రంలో 12, 13, 14 తేదీల్లో, తమిళనాడులో 18వ తేదీ నుంచి త్రిపిటక పఠనోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చెర్వుగట్టు జాతర ప్రారంభం

- ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన అదనపు కలెక్టర్


పూజలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ దంపతులు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుపై కొలువైన పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం రథసప్తమి సందర్భంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన అదనపు కలెక్టర్ శ్రీనివాస్, బ్రహ్మోత్సవాల ప్రత్యేకాధిరి బొల్లంపల్లి కృష్ణ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్‌ను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ తదితరులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచం, దీక్షాదహణ, ఏకాదక్ష రుద్రాభిషేకం, నిరాజన మంత్రపుష్పము వంటి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథులకు వేద పండితులు ఆశీర్వచనం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, మాజీ చైర్మన్లు పున్నపురాజు యాదగిరి, రేగట్టే రాజశేఖర్‌రెడ్డి, వరాల రమేష్, గడుసు శీధర్‌రెడ్డి, రేగట్టే నవీన్‌రెడ్డి, రేగట్టే నర్సిరెడ్డి, మల్ల శంకర్, నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. మైక్ సెట్ సక్రమంగా పనిచేయకపోవడంతో వేద పండితులు కొంత నిరుత్సాహపడ్డారు.


విద్యుత్ కాంతుల వెలుగుల్లో చెర్వుగట్టు పరిసరాలు (ఇన్‌సెట్‌లో) కల్యాణానికి తరలివస్తున్న భక్తులు

ఘనంగా రథసప్తమి వేడుకలు


శాలిగౌరారం: ఆకారం గ్రామంలోని సూర్య దేవాలయంలో నవగ్రహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు


భువనగిరి: సూర్యప్రభ వాహన సేవను ఆలయ మాడ వీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో గల పురాతన సూర్య దేవాలయంలో వందల ఏళ్ల తర్వాత మంగళవారం తొలిసారిగా రథసప్తమి వేడుకలను ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక సూర్య దేవాలయంగా ఈ ఆలయం చరిత్రలో నిలిచింది. రథసప్తమి సందర్భంగా ఆలయంలో సూర్యగ్రహారాధన, సూర్య నమస్కారం, నవగ్రహ పూజలు, శివాభిషేకం, నవగ్రహ హోమం, సూర్యహోమం, పూర్ణాహుతి జరిపించారు. ఈ పూజల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, శివ మాలధారులు పాల్గొన్నారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన సూర్యనారాయణుడి చిత్రపటం వద్ద, శివలింగానికి భక్తులు పంచామృత అభిషేకాలను చేశారు. సుమారు 800 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్పతో పాటు స్థానిక మాజీ సర్పంచ్ కందాల సమరంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వలిశెట్టి సైదులు, వల్లాల మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్, మాజీ ఎంపీటీసీ మాదగోని కవితరామలింగయ్య, దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వలిశెట్టి కోటేశ్, ప్రతినిధులు అయితగోని గణేశ్, సతీష్, నిమ్మనగోటి పరమేశ్, వలిశెట్టి గోపి, పొడిశెట్టి కిరణ్, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరి క్షేత్రంలో..

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రభ వాహన సేవ, పెద్ద శేష వాహన సేవ, హనుమంత వాహన సేవ, చక్రస్నాన మహోత్సవం, గజ వాహన సేవ, సింహ వాహన సేవ, గరుడ వాహన సేవ, రాత్రి రథోత్సవ సేవను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, చైర్మన్లు గోపికృష్ణ, మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు శ్రవణచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు


పాతగుట్ట పుర వీధిలో స్వామి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట క్షేత్రానికి అనుబంధ ఆలయమైన శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం అర్చకులు నిత్యారాధనలు జరిపించి, తిరుమంజన మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి పురప్పాట్ సేవను ఆలయ పుర వీధిలో ఊరేగించారు. సాయంత్రం నిత్యారాధనలు జరిపించిన తర్వాత.. దివ్య ప్రబంధ సేవాకాలం, స్వామి, అమ్మవారు, ఆళ్వారుల పురప్పాట్ సేవను నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆలయాధికారులు పాల్గొన్నారు.

మాల, మాదిగల మధ్య కాంగ్రెస్ చిచ్చుపెట్టింది

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటికీ చేయకుండా మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 7వ తేదీన హైదరాబాద్‌లో మాదిగలు నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు–వేల గొంతుకలు' కార్యక్రమానికి ప్రభుత్వం అనుమతి నిరాకరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని అన్నారు. 7వ తేదీన జరిగే కళా ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు చిరుమర్తి యాదయ్య, బాషపాక రవికుమార్, వడ్డేపల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల తరఫున ప్రశ్నించే గొంతుకనవుతా


ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి దామెర బాబురావు తదితరులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల తరఫున ప్రశ్నించే గొంతుకనవుతానని ఎమ్మెల్సీ అభ్యర్థి, రిటైర్డ్ హెడ్మాస్టర్ దామెర బాబురావు అన్నారు. 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నానని, ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని ఉపాధ్యాయ ఓటర్లను కోరారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిసారి అగ్రవర్ణాలకు చెందిన వారు పోటీలో ఉంటున్నారని, తనకు ఈసారి అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. ధర్మా టీచర్స్ యూనిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దామెర బాబురావుకు మద్దతు తెలుపుతున్నామన్నారు. దామెర బాబూరావు ఎన్నో పోరాటాల్లో స్వయంగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేశారని తెలిపారు. ఆర్థిక బలం, అంగ బలం ఉన్నవారు విందులు, వినోదాల పేరిట ఉపాధ్యాయులకు ఎరవేసి అక్రమ పద్ధతుల్లో గెలవాలని చూస్తున్నారని.. వారికి అడ్డుకట్ట వేసి బాబూరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లుయాదవ్, జిల్లా కన్వీనర్ బొంగరావల నాగయ్య, కోకన్వీనర్ డేవిడ్, పేర్ల వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ


బంగారు పతకం అందుకుంటున్న రిక్విత్‌రెడ్డి

మఠంపల్లి: మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మన్నెం కరుణాకర్‌రెడ్డి, ఉమారాణి దంపతుల కుమారుడు మన్నెం రిక్విత్‌రెడ్డి హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో గల కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఈ నెల 2,3 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే(నేషనల్ లెవల్ కుమితే కట్టా) పోటీల్లో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించాడు. భువనగిరిలోని తేజస్ ఎడ్యుకేషనల్ సొసైటీ భువన్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న రిక్విత్‌రెడ్డి స్థానిక కరాటే మాస్టర్ వినయ్ వద్ద శిక్షణ పొందుతున్నాడని తండ్రి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. భువన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ చావా భాను, టీచర్లు రిక్విత్‌రెడ్డిని అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

దేవరకొండ: అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని ఎల్ఐసీ కాలనీలో ఉప్పునూతల వెంకటేష్(34) తన తల్లి, సోదరుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ తిరిగి రాలేదు. మంగళవారం దేవరకొండ పట్టణ శివారులోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నడిగూడెం సహకార సంఘంలో విచారణ

నడిగూడెం: నడిగూడెం సహకార సంఘంలో క్లర్క్‌గా పనిచేస్తున్న బీరవల్లి సుధాకర్‌రెడ్డి తనను సంఘం చైర్మన్ వేధిస్తున్నాడంటూ ఈ నెల 3వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై మంగళవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ పద్మజ సహకార సంఘం కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విచారణ అనంతరం నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆడిటర్ అంబేద్కర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రిమాండ్

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రెడ్యానాయక్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రైతుల పోస్టాఫీస్ అకౌంట్లలో జమ అయిన పత్తి డబ్బులు సుమారు రూ.14లక్షలు, పింఛన్ డబ్బులు సుమారు రూ.6లక్షలు కాజేసిన ఘటనలో ఆయనను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

సూర్యాపేటలో మరో పరువు హత్యకు స్కెచ్!

- తనది తక్కువ కులమని హత్య చేసేందుకు ప్లాన్ వేశారని యువకుడి ఆరోపణ

సూర్యాపేటటౌన్: పది రోజుల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాల బంటి పరువు హత్యను మరువకముందే తెరపైకి మరో కులాంతర ప్రేమకథ వచ్చింది. తాము ప్రేమించుకుంటున్నామని తెలిసి యువతి కుటుంబ సభ్యులు, బంధువులు తనపై దాడి చేసి హత్య చేసేందుకు ప్లాన్ చేశారని ఆరోపిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బండ్ల కామేష్ మంగళవారం ఓ వీడియో రిలీజ్ చేశాడు. బండ్ల కామేష్, ఓ యువతి రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు ఆమెకు పెళ్లి ఫిక్స్ చేసి ఎంగేజ్‌మెంట్ చేశారు. కాగా ఆ యువతి కామేష్‌కు ఫోన్ చేసి 'నేను నిన్నే పెళ్లి చేసుకుంటాను.. లేకపోతే చనిపోతా' అని చెప్పడంతో కామేష్ కూడా పెళ్లి చేసుకుంటామని ఆమెకు చెప్పాడు. ఈ విషయం తెలిసిన యువతి తండ్రి తనను హత్య చేసేందుకు ప్లాన్ వేసి తాను ప్రేమించిన అమ్మాయి ద్వారా ఫోన్ చేయించి ఇంటికి రావాలని కోరడంతో శనివారం రాత్రి వాళ్ల ఇంటికి వెళ్లగా తనపై యువతి తండ్రితో పాటు మరో ముగ్గురు కలిసి దాడి చేశారని కామేష్ విడుదల చేసిన వీడియోలో ఆరోపించాడు. అక్కడి నుంచి పారిపోయి తన ఇంటికి వెళ్లగా తనను వెంబడించి ఇంటికి వచ్చి మరి కత్తులతో దాడి చేశారని, అడ్డుకోబోయిన తన తండ్రి, నాయనమ్మ, అమ్మపై కూడా దాడి చేశారని, తాను అక్కడి నుంచి భయంతో పారిపోయానని వివరించాడు. తన తండ్రికి, నాయనమ్మకు తీవ్ర గాయాలయ్యాని తెలిపాడు. పారిపోయానని తెలిసి తన పెదనాన్న ఇంటికి వెళ్లి కూడా వెతికారని, తాను ప్రేమించిన యువతిని కొట్టి బలవంతంగా తనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో రేప్ కేసు, గంజాయి కేసు పెట్టించారని చెప్పాడు. తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నట్లు వివరించాడు. తనను చంపేందుకు రెండు బ్యాచ్‌లు తిరుగుతున్నాయని, తనకు న్యాయం చేయాలని వీడియోలో వేడుకున్నాడు. మాల బంటిని ఎలా చేశారో అలాగే చేస్తామని యువతి కుటుంబ సభ్యులు తనను బెదిరించారని, పోలీసులకు దగ్గరకు వెళ్తే తనకు న్యాయం జరగలేదని చెప్పాడు. ఈ దళితుడిని మీడియా వారే కాపాడాలంటూ వీడియోలో వేడుకున్నాడు.

యువకుడిపై కేసు నమోదు

ఈ నెల 1న బండ్ల కామేష్ తాను ప్రేమించిన యువతి ఇంటికి వెళ్లి ఆమె పెళ్లి చెడగొడతానని బెదిరించడంతో యువతి తండ్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 2వ తేదీ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కామేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపారు. కామేష్ విడుదల చేసిన వీడియోపై పట్టణ సీఐని వివరణ అడగగా.. కామేష్, అతడి కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇక్కడ కూడా గోధుమ పంట

- చిట్యాల మండలం పెద్దకాపర్తిలో సాగు చేస్తున్న రైతు


పెద్దకాపర్తిలో రైతు సత్తిరెడ్డి సాగుచేస్తున్న గోధుమ

చిట్యాల: నల్లగొండ జిల్లాలో రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తుంటారు. ఇందుకు భిన్నంగా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన రైతు గంట్ల సత్తిరెడ్డి గోధుమ పంటను సాగు చేస్తున్నారు. ఆయన తనకున్న పదెకరాల పొలంలో ఒక ఎకరం భూమిలో గత డిసెంబర్‌లో గోధుమ సాగు చేయటం ప్రారంభించారు. మరో పది రోజుల్లో పంట చేతికి వస్తుంది. వరి పంటతో పోల్చితే తక్కువ నీటితో, భూమిలోని కొద్దిపాటి తేమ శాతంతో, తక్కువ పెట్టుబడితో గోధుమ పంట సాగు చేయవచ్చు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తే మార్చి, ఏప్రిల్ నెలల్లో నీటి ఎద్దడితో బోర్లు ఎండిపోయి పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. అలాకాకుండా గోధుమను డిసెంబర్ నెలలో సాగు చేస్తే వేసవి ప్రారంభం కావటానికి ముందే కొద్దిపాటి నీటి వనరులను ఉపయోగించడం ద్వారా ఫిబ్రవరి నెలలో పంట చేతికి వస్తుంది. భూములను సారవంతం చేసేందుకుగాను ఎప్పుడు వరినే కాకుండా గోధుమను కూడా సాగు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మొదటిసారి గోధుమ సాగుచేశా

ఎకరం పొలంలోమొదటిసారి గోధుమ పంట సాగుచేశా. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో గోధుమను సాగు చేసుకోవచ్చు. రైతులంతా ఎప్పుడూ ఒకే పంటను కాకుండా భిన్నమైన పంటలను పండించాలి.

– గంట్ల సత్తిరెడ్డి, పెద్దకాపర్తి, చిట్యాల మండలం